క్లుప్తంగా

బీజేపీని విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదు



ఆర్మూర్‌టౌన్: బీజేపీను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ఐక్య కార్యచరణ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. బీజేపీ ఇచ్చిన హామీలను మోదీ నాయకత్వంలో అమలవుతున్నట్లు తెలిపారు. నాయకులు కలిగోట గంగాధర్, అనిల్, ద్యాగ ఉదయ్, పోల్కం వేణు, రంగన్న, జక్కం పోశెట్టి పాల్గొన్నారు.

'ప్లాస్టిక్' వాడితే జరిమానా



ఆర్మూర్‌టౌన్: ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడితే జరిమానా విధిస్తామని సానిటరి ఎస్సై గజానంద్ అన్నారు. ఆర్మూర్‌లో బుధవారం ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. గజానంద్ మాట్లాడుతూ.. ఇకపై ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన, వినియోగించిన మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో పట్టుబడిన ప్లాస్టిక్‌ను సీజ్ చేసి జరిమానా విధించారు. అధికారులు పూర్ణమౌళి, అక్షయ్, రవి, ప్రశాంత్, నరేష్, సంతోష్, నర్సయ్య పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను బుధవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు ఆంజనేయులు, అశోక్, పవన్ రాజ్ పాల్గొన్నారు.

తడపాకల్‌లో..

మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని తడపాకల్‌లో బుధవారం అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ సర్వే నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి చరణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదానంద్, నీటిపారుదల శాఖ ఉద్యోగులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఆధారంగా స్థలాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు వెల్లడించారు.

మెరుగైన వైద్యం అందించాలి



బోధన్: బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పీవోడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు పట్టణంలో ధర్నా చేపట్టారు. పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రిలో రోగం నయం కాకపోవడంతో పేదలు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. నాయకులు బీపాషా బేగం, యాదమ్మ, సాయమ్మ, పోచవ్వ, అరుణ, కవిత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



బాల్కొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మోచీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ దశరథ్ అన్నారు. మాల మహానాడు బుధవారం ఇచ్చిన బంద్ పిలుపును నిరసిస్తు ముప్కాల్‌లో వారు నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కిరణ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి



బాల్కొండ: తమ వేతనాలను వెంటనే చెల్లించాలని మిషన్ భగీరథ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు మండలంలోని జలాల్‌పూర్‌లో నిరసన తెలిపారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, పంపు హౌజ్ వద్ద మోటర్లను బంద్ చేశారు. గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు.

ఇందిరమ్మకాలనీ రోడ్లు అధ్వానం

- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



కాలనీలో అధ్వానంగా మారిన రోడ్డు



ఇందిరమ్మకాలనీలో బురద రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ గ్రామంలో 35 సంవత్సరాల క్రితం ఇందిరమ్మ కాలనీ ఏర్పాటయింది. కానీ ఇప్పటికీ కాలనీలో సీసీ రోడ్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా తమకు మట్టి రోడ్లే దిక్కయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

కాలనీలో సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇప్పటికీ కాలనీలో మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాలు కురిస్తే మట్టి రోడ్లు బురదమయంగా మారడంతోపాటు, గుంతల్లో నీరు నిలిచి ఉంటుంది. దీంతో వాహనదారులు, కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో రెండేళ్ల క్రితం వరకు విద్యుత్ సౌకర్యం కూడ లేదు. అది కూడ అధికారులను నిలదీసి విద్యుత్ లైన్ వేయించుకున్నట్టు కాలనీవాసులు తెలుపుతున్నారు. ఎస్సీ కాలనీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరుచేస్తుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కానీ ముప్పై ఏళ్లుగా ఆ నిధులు కాలనీకి రాకపోవడంపై వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన నిధులను పక్కదారి పట్టించి మరోచోట నిర్మించారనేది కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నిధులు సరిపోలేవు..

అమ్రాద్ గ్రామంలో రెండు ఎస్సీ కాలనీలు ఉన్నాయి. వచ్చిన నిధులతో ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మించాం. సీసీ రోడ్లు మాత్రమే వేయలేదు. కాలనీలో ఐదు అంతర్గత రోడ్లు ఉన్నాయి. నిధులు సరిపోవన్న ఉద్దేశ్యంతో రోడ్లు వేయలేదు.

– లింగం, మాజీ సర్పంచ్, అమ్రాద్

నిధులు మళ్లించారు..

ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రత్యేక నిధులను జీపీ పాలకవర్గ సభ్యులు పక్కదారి మళ్లించారు. ఈ విషయమై జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపించి కాలనీ అభివృద్ధికి సహకరించాలి.

– గంగాధర్, ఏఐకేఎంఎస్ నాయకుడు, మాక్లూర్

భారత్ బంద్‌కు మిశ్రమ స్పందన





బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు, బీఎస్పీ నాయకులు.. వేల్పూర్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు సభ్యులు, బీఎస్పీ నాయకులు బుధవారం చేపట్టిన భారత్ బంద్‌కు మిశ్రమ స్పందన వచ్చింది. పోతంగల్, రుద్రూర్, కోటగిరి, సాలూర, చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది. బోధన్ సహా పలు మండలాల్లో పాక్షికంగా కొనసాగింది. కోటగిరి, బోధన్, వేల్పూర్‌లో ఆయా సంఘాల నాయకులు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పలు మండలాల్లో ర్యాలీని పోలీసులు అడ్డు కోగా, నాయకులు వారితో వాగ్వాదం చేశారు. బంద్ నేపథ్యంలో వర్ని పోలీసులు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



బోధన్‌లో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాల మహానాడు నాయకులు

వర్ని మండలంలో బంద్ ప్రభావం కనిపించలేదు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. తీర్పును సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అంశాన్ని విరమించుకోని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



చందూర్‌లో..



కోటగిరిలో మూసి ఉంచిన దుకాణాలు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి





గోవింద్‌పేట్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు.. కమ్మర్‌పల్లిలో..

ఆర్మూర్/పెర్కిట్/కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులందరికీ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పలు మండలాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో రైతులు ధర్నాలు నిర్వహించారు. మామిడిపల్లి వద్ద గోవింద్‌పేట్ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో చేశారు. కమ్మర్‌పల్లిలోని జాతీయ రహదారిపై అరగంటకు పైగా నిర్వహించిన రాస్తారోకోతో రహదారికిరువైపులా వాహనాలు భారీగా నిలిచి పోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని రైతులను రాస్తారోకో విరమించాలని కోరారు. రైతులు అందుకు ఒప్పుకోకపోవడంతో పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్మూర్‌లో రైతు ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 24న నిర్వహించనున్న 'చలో ఆర్మూర్' కరపత్రాలను ఆవిష్కరించారు.

పోరాటం చేస్తాం..

బాల్కొండ/బోధన్ : రైతులకు రుణమాఫీ చేయకుంటే రైతుల పక్షాన బీఆర్‌ఎస్ నిరంతరం పోరాటాలు చేస్తుందని మెండోరా మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాజారెడ్డి, కమాలకర్, గంగాధర్, గంగారెడ్డి ఉన్నా రు. బాల్కొండలో మండల అధ్యక్షుడు నాగుల పల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించిందన్నారు. బోధన్‌లో నియోజకవర్గస్థాయి రైతుల ధర్నా కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం ప్రకటనలో తెలిపారు.



మెండోరాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌హెచ్‌వో రవి కుమార్ అన్నారు. ఆర్మూర్‌లో బుధవారం ఆయన వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయద్దన్నారు. ఎస్సైలు గంగాధర్, అంజమ్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్: పట్టణంలోని విజయ సాయి హైస్కూల్‌లో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి, రామకృష్ణ, శ్రీనివాస్‌రాజు, లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలి





ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు.. బాల్కొండలో విద్యార్థుల మానవహారం

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరపాలని పీవోడబ్ల్యూ (ప్రగతిశీల మహిళ సంఘం) జిల్లా అధ్యక్షురాలు గోదావరి డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో మృతురాలికి నివాళులు అర్పించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. బాల్కొండలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మృతురాలికి నివాళులు అర్పించారు. సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం దరఖాస్తుల వెల్లువ

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పొందని రైతులు రైతు వేదికకు క్యూ కట్టారు. రుద్రూర్‌లోని రైతువేదిక వద్దకు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ కొత్త నిబంధనల ప్రకారం దరఖాస్తు చేయాలని అధికారులు తెలపడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో గతంలో సమర్పించిన దరఖాస్తులను రైతులు వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. రెండు రోజుల్లో 227 మంది రైతులు కొత్తగా దరఖాస్తులు అందచేశారు. బుధవారం భారత్ బంద్ పిలుపు ఉండడంతో రైతులకు ఇబ్బంది రాకుండా సీఐ జయేష్‌రెడ్డి రైతువేదిక వద్ద పర్యవేక్షించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సంక్షిప్తం

రోడ్డు కోసం పరిశీలన



మోర్తాడ్: ఏర్గట్ల, తడపాకల్ మధ్య ఉన్న మార్గంలో తారు రోడ్డు నిర్మించడానికి బుధవారం అధికారులు పరిశీలన చేశారు. అటవీ శాఖ అధికారులు శ్రీనివాస్, వరుణ్‌లు సంబంధిత మార్గాన్ని సందర్శించారు. నాయకులు శివన్నోల్ల శికుమార్ ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ కేజీబీవీ పాఠశాలను



డీఈవో దుర్గా ప్రసాద్ బుధవారం పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయినులకు సూచించారు. అనంతరం తరగతి గదుల్లో బోధనను డీఈవో పరిశీలించారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ దినోత్సవం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో బుధవారం జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులను సత్కరించారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలి

ఆర్మూర్‌టౌన్: డ్రైవర్లు, కండక్టర్లు ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలని ఆర్మూర్ డిపో మేనేజర్ రవికుమార్ అన్నారు. రాఖీ పండుగ రోజు ఆర్మూర్ డిపోలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చిన ఉద్యోగులను అభినందించారు.

నేడు బోధన్ ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం

బోధన్: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ఈ నెల 12న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గురువారం పట్టణంలో నూతన పాలకవర్గ సభ్యుల పదవీ ప్రమాణస్వీకారం నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

'మహిళా సాధికారత'పై అవగాహన



బోధన్: పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'మహిళ సాధికారత' పై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలను నిలువరించేందుకు కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు. అంజనదేవి, బాల గంగాధర్, పాండురంగారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


ఆలే నరేంద్ర జయంతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్‌లో పద్మశాలి సంక్షేమసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆలే నరేంద్ర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మోహన్‌దాస్, దాసరి సునీల్, రమాకాంత్, రవి, నారాయణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బదిలీపై వెళ్లిన ఏడుగురు అధ్యాపకులకు, బదిలీపై వచ్చిన 8మందికి బుధవారం కళాశాల ధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు బుక్కులు, పెన్నుల వితరణ



బాల్కొండ: ముప్కాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులను అందజేశారు. నర్సయ్య, జక్కుల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

సానిటరీ ప్యాడ్స్..

మోర్తాడ్: మండల కేంద్రంలోని సబ్ సెంటర్ వద్ద మహిళలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. గోపిడి సత్యనారాయణ, పబ్బ సంజీవ్, శ్రీనివాస్, గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి..

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు బుధవారం పారిశ్రామిక వేత్త, విద్యావేత్త ఏనుగు దయానంద్ క్రీడా సామగ్రి వితరణ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

మోర్తాడ్: మోర్తాడ్‌లో రెండు మండలాల ఉపాధ్యాయులతో డీటీఎఫ్(డెమొక్రటిక్ టీచర్స్ యూనియన్) సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్, జిల్లా అధ్యక్షుడు బాలయ్య, టీచర్లు పాల్గొన్నారు.

రాజారెడ్డికి ఘన నివాళి


వేల్పూర్: అంకాపూర్ లాలన వృద్ధాశ్రమంలో బుధవారం సమాజసేవకుడు పైపుల రాజారెడ్డి ద్వాదశ దినకర్మ నిర్వహించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

వెల్మల్‌లో రక్షాబంధన్



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని వెల్మల్‌లో గల శారద విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం రక్షా బంధన్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. సందీప్ భట్వార్, నరేందర్, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


23న గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



రుద్రూర్: కోటగిరిలోని వినాయక నగర్‌లో ఈ నెల 23న సంకట విమోచన గణపతి ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఇందులోభాగంగా బుధవారం విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

మాక్లూర్/మోర్తాడ్/బోధన్‌రూరల్: మాక్లూర్ ఎస్సైగా రాజశేఖర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అలాగే మోర్తాడ్ ఎస్సైగా విక్రమ్, బోధన్ రూరల్ ఎస్సైగా మచ్చేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.



మాక్లూర్ ఎస్సై రాజశేఖర్



మోర్తాడ్ ఎస్సై విక్రమ్



బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి

ఎస్సైకి సన్మానం

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన హరిబాబును బుధవారం మండల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘ సభ్యులు శ్రావణ్, రామరాజు, వికాస్, నవీన్ ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆయ్ (తెలుగు) - 12.30, 7.00, మిస్టర్ బచ్చన్ (తెలుగు) -03.35, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) - 10.05
స్క్రీన్-2 –	స్త్రీ-2 (హిందీ) - 12.35, 04.00, 7.15, 10.30
స్క్రీన్-3 –	తంగలాన్ (తెలుగు) - 11.40, 6.15, 9.35, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 3.00
స్క్రీన్-4 –	శంకర్ దాదా ఎంబీబీఎస్ - (తెలుగు) 11.00, 6.30, ఇంద్ర (తెలుగు) - 2.40, 10.10

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	తంగలాన్ (తెలుగు) - 10.25, 1.25, 7.25, 10.30, మిస్టర్ బచ్చన్(తెలుగు) - 4.25
స్క్రీన్-2	ఇంద్ర (తెలుగు) - 10.05, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు)-1.20, ఆయ్(తెలుగు)-4.30, స్త్రీ-2 (హిందీ) - 7.30, 10.25
స్క్రీన్-3	ఇంద్ర (తెలుగు) - 12.55, 7.05, స్త్రీ-2 (హిందీ) - 4.10, ఆయ్ (తెలుగు) - 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	స్త్రీ-2 (హిందీ) -12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-2	శంకర్‌దాదా ఎంబీబీఎస్ (తెలుగు) - 12.00, 7.00, తంగలాన్ (తెలుగు) - 3.40, ఇంద్ర (తెలుగు)- 10.40
స్క్రీన్-3	స్త్రీ-2 (హిందీ) - 10.00, ఆయ్ (తెలుగు) - 1.15, ఖేల్ ఖేల్ మే (హిందీ) - 4.20, తంగలాన్ (తెలుగు) - 7.20, మిస్టర్ బచ్చన్ (తెలుగు) - 10.40
స్క్రీన్ -4	డబుల్ ఇస్మార్ట్ (తెలుగు)-1.00, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 4.25, ఆయ్ (తెలుగు)-7.40, వేదా(హిందీ)- 10.45
దేవి	కమిటీ కుర్రోళ్ళు - 11.15 , 2.15, ఆయ్ (తెలుగు)-6.15,9.15
నటరాజ్	ఇంద్ర (తెలుగు)- 11.30, 2.30, స్త్రీ-2 (హిందీ) - 6.30, 9.30
విజయ్	మిస్టర్ బచ్చన్(తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్(తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,300	వెండి (కిలో)	89,000
22 క్యారెట్స్	68,542		

– నిజామాబాద్ బిజినెస్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899